సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 10 । ఆగస్టు । 2024



గృహప్రవేశాలు ఎప్పుడు?
టిడ్కో లబ్ధిదారులతో శ్రావణ మాసంలో గృహప్రవేశాలు చేయిస్తామని ఎన్నికల ప్రచారంలో మంత్రి నిమ్మల హామీ ఇవ్వగా లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. 8లో ▸



అనుమానాస్పద మృతి
భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా వివాహిత తాగునీటి చెరువులో శవమై తేలిన ఘటన కలిదిండి మండలం సానారుద్రవరం కొత్త కాలనీలో చోటుచేసుకుంది. 8లో ▸



నిందితుడి అరెస్ట్
కొయ్యలగూడెం మండలం రామానుజపురంలో రాజనాల సాయిలక్ష్మి హత్యకు సంబంధించి ఆమె భర్త సూర్యచంద్రాన్ని పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో ▸

● అంబరాన్నంటిన ఆదివాసీ సంబరం



అడవిబిడ్డల సంబరాలు అంబరాన్నంటాయి. కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, గిరిజన మహిళల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆదివాసీ మహిళలతో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి నృత్యాలు చేస్తున్న దృశ్యం. ..8లో

● రాజ్యాంగ నిర్మాతకు క్షీరాభిషేకం



విజయవాడ స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతివనంలో విధ్వంసంపై జిల్లావ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ.. రాజ్యాంగ నిర్మాత విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. భీమవరం గునుపూడిలో క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం. ..8లో

న్యూస్‌రీల్

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): గిరిజనులు ఉన్నత చదువులతో అభివృద్ధి చెంది జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొమరం భీమ్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలో ఎరుకలు, యానాది, చెంచుల కుటుంబాలపై పూర్తి దృష్టి సారించామన్నారు. గిరిజన నాయకులు మాట్లాడుతూ యానాదులకు ఆధార్ కార్డులు ఇప్పించాలని కోరారు. వచ్చేనెలలో గిరిజన సంఘాల నాయకులతో సమావేశమై సమస్యలపై సమీక్షిస్తామని కలెక్టర్ తెలిపారు.

జేసీగా రాహుల్‌కుమార్‌రెడ్డి



రాహుల్‌కుమార్‌రెడ్డి

సాక్షి, భీమవరం: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా టి.రాహుల్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2020 బ్యాచ్‌కు చెందిన రాహుల్‌కుమార్‌రెడ్డి ఇప్పటివరకు సీతంపేట ఐటీడీఏ పీఓగా పనిచేశారు. ఆయన స్వస్థలం కడప జిల్లా పెండ్లిమర్రి మండలంలోని నంది మండలం. గతంలో ఇక్కడ జేసీగా పనిచేసిన ప్రవీణ్ ఆదిత్య ఏపీ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ఎండీగా నియమితులయ్యారు.

వ్యాసరచన పోటీల్లో విజేతలు

భీమవరం: సర్వోదయ మండలి ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో విద్యార్థులకు పర్యావరణ–పరిరక్షణపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతల వివరాలను శుక్రవారం మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. సీనియర్స్ విభాగంగా కేఎస్ అమూల్య(వైఎస్‌పాలెం), వి.గీతిక (నత్రంపాడు), ఎంఎస్ఎస్ దీపిక(తిమ్మరాజుపాలెం) మొదటి మూడు స్థానాల్లో నిలిచారన్నారు. జూనియర్స్ విభాగంలో జి.సాహితి (అత్తిలి), ఎస్.బ్రాహ్మణి(గోపాలపురం), ఎం.హిమశ్రీవర్ష (పాలకొల్లు), సబ్ జూనియర్స్ విభాగంలో కె.శ్రావణి (అజ్జరం), ఎం.కార్తికేయ (ఉల్లంపర్రు), బి.జోషితసాయి (భీమవరం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులు అందిస్తామని తెలిపారు.

పొరుగు జిల్లాల నుంచి ఇసుక పొందొచ్చు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో ఇసుక రీచ్‌లు అందుబాటులో లేనందున పొరుగు జిల్లాల నుంచి సుక పొందవచ్చని కలెక్టర్ నాగరాణి తెలిపారు. తూర్పుగోదావరి, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన నిర్వహణ చార్జీలు చెల్లించి ఇసుకను ఉచితంగా పొందవచ్చని పేర్కొన్నారు.

ప్లేస్‌మెంట్ కల్పించాలని వినతి



కలెక్టర్‌ను కలిసిన పంచాయతీ కార్యదర్శులు

యలమంచిలి: పంచాయతీ కార్యదర్శుల సంఘ జిల్లా నాయకులు శుక్రవారం కలెక్టర్ నాగరాణిని ఆమె భీమవరంలోని ఆమె చాంబర్‌లో కలిశారు. ఇటీవల గ్రేడ్–2 కార్యదర్శులుగా పదోన్నతులు పొందిన 54 మంది కార్యదర్శులకు ప్లేస్‌మెంట్ చూపాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు పాలా శారద శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దేవబత్తుల నాగదేవి, సభ్యులు ఉన్నారు.

అవయవ దానం.. ముగ్గురికి ప్రాణం



శ్రీనివాస్ (ఫైల్)

ఏలూరు(మెట్రో): ఏలూరుకు చెందిన వ్యాపారి టీఎస్‌వీఎల్ఎస్ శ్రీనివాస్ (57) మృతిచెందగా ఆయన శరీరంలోని అవయవాలను దానం చేయడంతో ముగ్గురికి పునర్జన్మను ప్రసాదించారు. శ్రీనివాస్‌కు తీవ్ర తలనొప్పి రాగా ఇటీవల సికింద్రాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి ఆయన బెయిన్ డ్రెడ్‌కు గురయ్యారు. అవయవ దానంపై కిమ్స్ ఆస్పత్రిలోని సమన్వయకర్తలు మృతుడి కుటుంబ సభ్యులకు, బంధువులకు అవగాహన కల్పించారు. అనంతరం శ్రీనివాస్ భార్య, కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన కాలేయం, కిడ్నీలను దానం చేశారు.

కట్టేయ్.. కోట్లు కొల్లగొట్టేయ్

గూడెంలో రియల్ మాఫియా
- పార్కింగ్ స్థలంలో అడ్డగోలుగా షాపింగ్ కాంప్లెక్స్
- కూటమి సిండికేట్ ఎత్తుగడ
- ఎమ్మెల్యే బొలిశెట్టి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడే మొదలైన పనులు
- నిర్మాణ భాగస్వాములుగా టీడీపీ, బీజేపీ నాయకులు
- ఒక్కో షాపు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలకు అప్పట్లోనే బేరసారాలు
- గత ప్రభుత్వంలో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న మున్సిపల్ అధికారులు
- తాజాగా మళ్లీ పనులు మొదలు పెట్టిన కూటమి నేతలు



తాడేపల్లిగూడెంలో షాపింగ్ కాంప్లెక్స్‌లోని పార్కింగ్ స్థలంలో మళ్లీ మొదలైన నిర్మాణ పనులు



2019 జూలైలో అనధికార నిర్మాణాన్ని తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు (ఫైల్)

సాక్షి, భీమవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో తాడేపల్లిగూడెంలో పచ్చపార్టీ నేతల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. టౌన్ ప్లానింగ్ నిబంధనలు తుంగలోకి తొక్కి కోట్లు కొల్లగొట్టే ఎత్తుగడ వేశారు. గతంలో మున్సిపల్ అధికారులు కూలగొట్టిన అక్రమ నిర్మాణాన్ని అధికారాన్ని అడ్డం పెట్టుకుని మళ్లీ మొదలు పెట్టేశారు. అడ్డగోలుగా నిర్మాణ పనులు కానిచ్చేస్తున్నారు. పనులు అడ్డుకోవాల్సిన మున్సిపల్ అధికారులు అధికార పార్టీ ఒత్తిళ్లకు చేష్టలుడిగి చూస్తున్నారు.

వీరి రూటే సెపరేటు
పట్టణ ప్రణాళిక నిబంధనలు ప్రకారం ఏదైనా భవన నిర్మాణం చేసేటప్పుడు ప్లాన్ అప్రూవల్ కోసం కమర్షియల్ కాంప్లెక్స్ అయితే బిల్డప్ ఏరియాలో పది శాతం పార్కింగ్‌కు కేటాయించాలి. ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేయకూడదు. అయితే తాడేపల్లిగూడెంలో కొందరు టీడీపీ నేతల రూటే సెపరేటు. సార్వత్రిక ఎన్నికల వరకు టీడీపీ అభ్యర్థిని తానేనంటూ ప్రచారం చేసుకున్న ఓ నేతతో పాటు 12 మంది సిండికేట్‌గా ఏర్పడి ఎనిమిదేళ్ల క్రితం ఏలూరు రోడ్డులోని గణేష్ రైస్‌మిల్లు ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. భాగస్వాముల్లో టీడీపీతో పాటు బీజేపీ నేత ఉన్నారు. అప్పట్లో టీడీపీ అధికారంలో ఉండగా ప్రస్తుత ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మున్సిపల్ చైర్మన్‌గా వ్యవహరించారు. సర్వే నంబర్ 13లో మొత్తం బిల్డప్ ఏరియా సుమారు 8,919.09 చదరపు మీటర్లు కాగా రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లుగా నిర్మాణం చేసేందుకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్‌కు దరఖాస్తు చేశారు. నిర్మాణ స్థలంలోని 1,213.21 చదరపు మీటర్లు పార్కింగ్‌కు కేటాయిస్తున్నట్టుగా ప్లాన్‌లో చూపించారు.

పార్కింగ్ స్థలంలో అడ్డగోలు నిర్మాణం
పార్కింగ్ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని రోడ్డు వైపు స్థలంలో అడ్డగోలుగా షాపులు నిర్మించారు. మూడు అంతస్తుల ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో మొత్తం 33 షాపులు నిర్మించి సొమ్ములు చేసుకోవాలని భావించారు. పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలో తొమ్మిది వరకు షాపులు నిర్మించగా మొదటి అంతస్తులో 12 వరకు షాపులు నిర్మాణం చేశారు. కాంప్లెక్స్ నిర్మాణంలో ఉన్న సమయంలోనే ఒక్కో షాపు రూ.25 నుంచి రూ.30 లక్షల వరకు బేరసారాలు జరిగాయి. కొన్నింటిని అమ్మకాలు కూడా చేసినట్టు సమాచారం. నిబంధనలు మీరినా అప్పటి అధికార పార్టీ ఒత్తిళ్లతో అధికారులు పట్టించుకోలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అక్రమ కట్టడం పనులకు బ్రేకులు పడ్డాయి. అనధికార కట్టడంపై అందిన ఫిర్యాదులతో 2019 జూలైలో మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపించారు. భారీ పోలీస్ బందోబస్తు నడుమ అనధికార నిర్మాణాలను కూల్చివేశారు. పార్కింగ్ స్థలంలో నిర్మించిన షాపుల గోడలు, వాటికి ఏర్పాటుచేసిన షట్టర్లను తొలగించారు.

మళ్లీ మొదలెట్టేశారు

గత ఐదేళ్లుగా సైలెంట్‌గా ఉన్న నిర్మాణదారులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో షాపుల ద్వారా కోట్లు కొల్లగొట్టేందుకు మరలా అక్రమ నిర్మాణానికి తెరలేపారు. అందుకోసం భవనం వద్దకు సిమెంట్, ఇసుక, ఇటుకలు తదితర నిర్మాణ సామగ్రిని తరలించారు. గతంలో మున్సిపల్ అధికారులు తొలగించిన పార్కింగ్ ఏరియాలోని షాపులకు షట్టర్లు పెట్టేందుకు వీలుగా పనులు చేయిస్తున్నారు. గతంలో గోడలు కూల్చివేసిన అధికారులు కూటమి నేతల ఒత్తిళ్లతో ఇప్పుడు భవనం వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు అంటున్నారు. తమ సౌలభ్యం కోసం సామాన్యులు ఒక మెట్టు నిర్మించుకుంటే నానా యాగీ చేసే టౌన్ ప్లానింగ్ అధికారులు పార్కింగ్ స్థలంలో అడ్డగోలుగా కమర్షియల్ షాపులు నిర్మిస్తున్నా చూస్తుండిపోవడం విమర్శలకు తావిస్తోంది.



పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలో నిర్మించిన అనధికార షాపింగ్ కాంప్లెక్స్

పక్కనే మరో అనధికార షాపింగ్ కాంప్లెక్స్

ఈ షాపింగ్ కాంప్లెక్స్ పక్కనే ఉన్న మరో షాపింగ్ కాంప్లెక్స్ భవనం పూర్తిగా అనధికార కట్టడంగా తెలుస్తోంది. గణేష్ రైస్‌మిల్లు ఏరియా మొత్తానికి పార్కింగ్ నిమిత్తం కేటాయించిన సుమారు ఐదు సెంట్ల స్థలంలో అధికార పార్టీకి చెందిన ఓ నేత మూడు అంతస్తుల్లో దాదాపు 30 వరకు షాపులతో ఈ కాంప్లెక్స్ నిర్మించినట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ షాపులు అమ్మకాల ద్వారా సదరు నేత కోట్లాది రూపాయలు వెనకేసినట్టు సమాచారం. ఇదిలా ఉండగా ఈ కాంప్లెక్స్‌కు సంబంధించిన సమాచారం తమ వద్ద లేదని టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతుండటం గమనార్హం. రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లపై టౌన్ ప్లానింగ్ అధికారి హరిప్రసాద్‌ను వివరణ కోరగా గతంలో తొలగించిన పార్కింగ్ స్థలంలో మరలా షాపులు నిర్మిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, నోటీసులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

అన్నదాతల ఆగ్రహ జ్వాలలు

- ధాన్యం బకాయిలు చెల్లించాలంటూ రాస్తారోకో
- జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్



నరసాపురం మండలం చిట్టవరం వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

నరసాపురం రూరల్: రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన ధాన్యం బకాయిల సొమ్ములు విడుదల చేయాలంటూ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో నరసాపురం మండలం చిట్టవరం గ్రామ మొగలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ధాన్యం విక్రయించి మూడు నెలలైనా సొమ్ములు ఇవ్వలేదంటూ పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. దీంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించి ఉద్రిక్తత నెలకొంది. నరసాపురం డీఎస్పీ, పాలకొల్లు, నరసాపురం సీఐలు, ఎస్సైలు సిబ్బందితో ఇక్కడికి చేరుకుని రాస్తారోకోను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ బకాయిల చెల్లింపుపై స్పష్టమైన హామీ ఇస్తే ఆందోళన విరమిస్తామన్నారు. ఆర్డీఓ అచ్యుత అంబరీష్ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. పౌరసరఫరాల జిల్లా మేనేజర్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడి ఈనెల 12న సాయంత్రంలోపు బకాయిలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. రైతు సంఘం నాయకులు కవురు శ్రీనివాస్, పిల్లి కామేశ్వరరావు, తానుకొండ సీతారామకృష్ణ, మద్దిశెట్టి నాగేశ్వరరావు తదితర రైతులు పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి



రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ సొమ్ములు చెల్లించకపోవడం దారుణం. చేతిలో సొమ్ములు లేకపోవడంతో పాటు ప్రకృతి వైపరీత్యాలు రైతును నిండా ముంచాయి. తక్షణమే బకాయిలు విడుదల చేయాలి.
– మామిడిశెట్టి రామంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

క్రాప్ హాలిడే ప్రకటిస్తాం



రైతులకు సకాలంలో ధాన్యం డబ్బులు అందకపోవడంతో రోడ్డున పడ్డాం. మల్లవరంలంకలో సుమారు 600 ఎకరాల్లో రైతులు పంట పండించేందుకు పెట్టుబడికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి దాపురించింది.
– చిట్నీడి బాల వెంకటేశ్వర్లు, రైతు, మల్లవరంలంక

మోసం చేస్తున్న ప్రభుత్వాలు



రైతులను మోసం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందున్నాయి. ధాన్యం బకాయిల కోసం అడిగితే కేసులు నమోదు చేస్తున్నారు. ధాన్యానికి డబ్బులడిగితే చెల్లించలేని దీనస్థితిలో ప్రభుత్వం ఉంది. రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలి.
– పిల్లి కామేశ్వరరావు, రైతు సంఘం నాయకులు

రూ.10 లక్షలు రావాలి



నేను 18 ఎకరాలు కౌలుకు తీసుకుని చేస్తున్నా. రెండు నెలలు క్రితం ధాన్యం విక్రయించినా డబ్బులు విడుదల చేయలేదు. ప్రభుత్వం నుంచి సుమారు రూ.10 లక్షలు రావాల్సి ఉంది. గత జగన్ ప్రభుత్వంలో పరిస్థితి ఇలా ఉండేది కాదు.
– మద్దిశెట్టి నాగేశ్వరరావు, కౌలు రైతు, మల్లవరంలంక

26న ఉద్యోగ దిక్సూచి

నరసాపురం/భీమవరం(ప్రకాశం చౌక్): నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో భాగంగా ఈనెల 26న ఉద్యోగ దిక్సూచి కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నరసాపురం వైఎన్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. పలు కంపెనీల్లో 420 ఉద్యోగాలను భర్తీ చేస్తామని, 10వ తరగతి నుంచి పీజీ వరకూ చదివిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 16–25 ఏళ్ల వయసున్న వారు అర్హులన్నారు. అభ్యర్థులు పశ్చిమగోదావరి జిల్లా ప్లేస్‌మెంట్ సెల్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు సెల్ 9502024765, 7023896277 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై మండిపాటు

వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లుపై ముస్లింలు మండిపడుతున్నారు. వక్ఫ్ సవరణ చట్టం బిల్లుపై 21 మంది ఎంపీలతో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటుచేయడాన్ని తప్పుపడుతున్నారు. ముస్లింలకు నష్టం కలిగించే ఈ బిల్లుకు టీడీపీ, జనసేన పార్టీలు మద్దతివ్వడం సరికాదంటున్నారు. వైఎస్సార్‌సీపీ, కేంద్రంలోని ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించడం హర్షణీయమని అంటున్నారు.
–భీమవరం (ప్రకాశంచౌక్)/తాడేపల్లిగూడెం టీటౌన్/ఆకివీడు/నూజివీడు/కైకలూరు

ఆమోదం దురదృష్టకరం



వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు తెలుగుదేశం కూటమి నేతలు ఆమోదం తెలపడం దురదృష్టకరం. మైనార్టీ సంఘాలన్నీ ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. మైనార్టీలపై కక్ష సాధింపుగా ఈ బిల్లును తీసుకువచ్చారు. బిల్లుకు మద్దతు పలికిన కూటమి ప్రభుత్వానికి మైనార్టీలు తగిన బుద్ధి చెబుతారు.
– కరిముల్లా బాషా, వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు

బిల్లును వెనక్కి తీసుకోవాలి



ముస్లింల హక్కులను కాలరాస్తూ స్వయం ప్రతిపత్తి కలిగిన వక్ఫ్ బోర్డు ఆస్తులను బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టేందుకు బిల్లు సవరణకు కేంద్ర ప్రభుత్వం చూడటం చాలా అన్యాయం. ఈ బిల్లు మత వ్యతిరేకమైంది. బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోంది.
– ఎస్కే నౌషాద్ మొహిద్దీన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి, తాడేపల్లిగూడెం

ఆస్తులపై పెత్తనం తగదు



వక్ఫ్ బోర్డు బిల్లు వల్ల ముస్లింల ఆస్తులపై పెత్తనం కేంద్రానికి పెరుగుతుంది. ఈ బిల్లుపై తెలుగుదేశం పార్టీ మద్దతు ప్రకటించడం మంచిది కాదు. సంస్కరణల పేరుతో వక్ఫ్ బోర్డుకు సవరణలు చేయడం వల్ల మా హక్కులకు భంగం కలుగుతుంది. సవరణలను ప్రభుత్వం విరమించుకోవాలి.
– షేక్ చాన్ బాషా, వక్ఫ్ బోర్డు సభ్యుడు, కలిదిండి

సవరణ అవసరమేముంది



వక్ఫ్ చట్టాన్ని సవరించాల్సిన అవసరమేముందో ముందుగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలకు సమాధానం చెప్పాలి. వక్ఫ్ చట్టంపై ముస్లింలకు అభ్యంతరం లేనప్పుడు దానిని సవరించాల్సిన పనేముంది. సవరణ అంశాన్ని ఉపసంహరించుకోవాలి.
– షేక్ మస్తాన్‌వలీ, నూజివీడు

వైఎస్సార్‌సీపీ అడ్డుకోవడం భేష్



రాజ్యాంగ స్ఫూర్తికి, లౌకిక వాదానికి వ్యతిరేకంగా ఉన్న వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో అడ్డుకోవడం ద్వారా తాము మత రాజకీయాలకు వ్యతిరేకమని వైఎస్సార్‌సీపీ మరోసారి స్పష్టం చేసింది. దీని ద్వారా మైనార్టీల ఆస్తులు, హక్కుల పరిరక్షణకు తాము కట్టుబడ్డామని జగన్ భరోసా ఇచ్చారు.
– షేక్ మస్తాన్, నూజివీడు

కేంద్ర ప్రభుత్వం కుట్రలు



ముస్లింలను అణచి వేసేందుకే కేంద్ర ప్రభుత్వం నిరంతరం కుట్రలు చేస్తోంది. వక్ఫ్ ఆస్తుల్ని కాజేసి ముస్లింలను మరింత పేదలుగా చేసేందుకు బీజేపీ పన్నాగం పన్నింది. దీనికి మద్దతు తెలిపిన టీడీపీకి ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారు. బిల్లును తీసుకురావడం బాధాకరం.
– ఎండీ జక్కీ, ఆకివీడు

క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం


కొయ్యలగూడెం మండలం కన్నాపురంలో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

కొయ్యలగూడెం: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఆర్ఐ మణిదివ్య శుక్రవారం తెలిపారు. కన్నాపురానికి చెందిన గ్రంధి శ్రీనివాస్ నివాసానికి సమీపంలోని గొడౌన్‌లో పీడీఎస్ బియ్యం నిల్వలు ఉన్నాయన్న సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో 40 క్వింటాళ్లు అక్రమంగా నిల్వ చేసి ఉంచిన బియ్యం గుర్తించి కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన బియ్యం విలువ సుమారు రూ.1.60 లక్షలు ఉంటుందన్నారు.

శ్రీవారి సేవలో ఐజీ హరికృష్ణ


ఐజీ హరికృష్ణకు స్వామివారి మెమెంటో అందజేస్తున్న ఆలయ డీఈఓ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని డీజీపీ కార్యాలయ ఐజీ సిరివెళ్ల హరికృష్ణ శుక్రవారం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు.

మంత్రి గారూ.. గృహప్రవేశాలు ఎప్పుడు?

- పాలకొల్లు టిడ్కో లబ్ధిదారుల ఎదురుచూపులు
- శ్రావణ మాసంలో గృహప్రవేశాలంటూ మంత్రి రామానాయుడు హామీ
- 2019లోనూ గృహప్రవేశాలంటూ నిమ్మల ఎన్నికల స్టంట్
- జగన్ పాలనలో 2560 మందికి టిడ్కో ఇళ్లు


పాలకొల్లులో ఇంకా పనులు ప్రారంభం కాని టిడ్కో ఇళ్లు



ఇళ్లు ఇవ్వకపోయినా ఇంటి సంబరం అంటూ 2019లో ఆంధ్రజ్యోతిలో కథనం


అప్పుడు దీక్ష పేరిట డ్రామాలు.. ఇప్పుడు హామీ అమలేది?

పాలకొల్లు సెంట్రల్: ×శ్రావణమాసం రాగానే టిడ్కో ఇళ్లలో గృహ ప్రవేశాలు చేయిస్తాం×.. ఎన్నికల ప్రచారంలో మంత్రి నిమ్మల రామానాయుడు పాలకొల్లు ప్రజలకు ఇచ్చిన హామీ ఏప్రిల్ 6, 2024న స్థానిక గాంధీబొమ్మల సెంటర్‌లో టీడీపీ ఎన్నికల సభలో రామానాయుడే కాకుండా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కూడా టిడ్కో లబ్ధిదారులకు శ్రావణమాసంలో గృహప్రవేశాలు చేయిస్తామని ప్రకటించారు. శ్రావణమాసం వచ్చింది. మంత్రి ఇచ్చిన ఎన్నికల హామీని ఈ నెలలో ఎప్పుడు నెరవేరుస్తారా? అని లబ్ధిదారులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

2019లో పనులు పూర్తి కాకుండానే గృహప్రవేశాలు

2019 ఎన్నికల సమయంలో పెంకుళ్లపాడు టిడ్కో గృహాలు పనులు పూర్తికాకుండానే 2019 ఫిబ్రవరి 10న గృహప్రవేశాలు చేయించారు. అప్పుడు పత్రాలు ఇచ్చారు తప్ప ఎవ్వరికీ ఇళ్లు ఇవ్వలేదు. టిడ్కో గృహాలు టీడీపీ ప్రభుత్వంలో 90 శాతం పూర్తయ్యాయని మిగిలిన 10 శాతం పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేయలేకపోయిందని ఎన్నికల్లో ప్రచారం చేశారు. అధికారంలోకి రాగానే పది శాతం పనులు పూర్తి చేస్తామని ఇచ్చిన మాటను ఎప్పుడు నిలుపుకుంటారోనని నియోజకరవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారు. 2019లోనే టిడ్కో గృహాలు 90 శాతం పనులు పూర్తిచేశాం.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మిగిలిన 10 శాతం పనులు పూర్తిచేయలేకపోయిందనేది గత ఐదేళ్లుగా మంత్రి నిమ్మల వాదన. తాము అధికారంలోకి వస్తే శ్రావణమాసంలో లబ్ధిదారులందరికీ గృహప్రవేశాలు చేయించి పండుగ సమయంలో ఇంటిలోకి పంపిస్తామని చంద్రబాబు, రామానాయుడు హామీ ఇచ్చారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి నాడు పాలకొల్లు ఇన్‌చార్జిగా గుణ్ణం నాగబాబు ఉండగా పెంకుళ్లపాడు, రామయ్యహాలు, పెదగరువు ప్రాంతాల్లో సుమారు 70 ఎకరాల భూమిని కొనుగోలు చేయించారు. పెంకుళ్లపాడులో 50 ఎకరాల భూమిని కేటాయించారు.

జగన్ పాలనలో 80 బ్లాకుల పూర్తి

మొత్తం 6,144 మంది లబ్ధిదారుల కోసం ఒక్కో బ్లాక్‌లో ఒక్కో ఫ్లోర్‌కు 8 పోర్షన్ల చొప్పున.. 4 ఫ్లోర్‌లకు 32 పోర్షన్లు నిర్మిస్తున్నారు. మొత్తం 192 బ్లాక్‌ల నిర్మాణం చేపట్టారు. శ్లాబ్‌ల పనులు మాత్రమే పూర్తికాగా, ఫ్లాట్లలో ఇంటీరియర్ పనులు జరగలేదు. 2019 ఎన్నికల సందర్భంగా టిడ్కో ఇళ్ల పంపిణీ చేస్తున్నట్టు పట్టాలు అందించి గృహప్రవేశాల పేరిట హడావిడి చేశారు. ఒక్క లబ్ధిదారుడికి అవి నివాస యోగ్యంగా లేవు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 80 బ్లాకుల్లో ఇంటీరియర్ పనులు పూర్తిచేసి 2,560 మంది లబ్ధిదారులకు గృహాలు ఇవ్వగా వారంతా టిడ్కో ఇళ్లలో ఉంటున్నారు. 112 బ్లాక్‌ల పనులు పూర్తికావాల్సి ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 41.5 శాతం టిడ్కో గృహాల పనులు పూర్తయ్యాయి. మిగిలిన గృహాలు మంత్రి గారు ఎప్పుడిస్తారో వేచిచూడాలి.

2,560 మందికి ఫ్లాట్లు ఇచ్చాం

టిడ్కో గృహాల్లో ప్రస్తుతం 80 బ్లాక్‌లు పూర్తయ్యాయి. వాటిలో 2,560 మంది లబ్ధిదారులకు ఇళ్లు ఇచ్చాం. ఇంకా 112 బ్లాక్‌ల పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం పెయింటింగ్ పనులు, ప్లంబింగ్ పనులు చేస్తున్నారు. సుమారు 75 నుంచి 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు జరుగుతున్నాయి.

– మణికంఠ, టిడ్కో ఏఈ, పాలకొల్లు

ఎన్నిసార్లు గృహ ప్రవేశాలు?



2019లో గృహప్రవేశాలు చేయించి పత్రాలు ఇచ్చారు తప్ప ఒక్కరికీ ఇల్లు ఇవ్వలేదు. 2024 ఎన్నికలు వచ్చేసరికి శ్రావణమాసంలో గృహప్రవేశాలు చేయిస్తామని నమ్మించి మళ్లీ లబ్ధి పొందారు. ఒక ఇంటికి ఎన్ని సార్లు గృహప్రవేశాలు చేస్తారు. వైఎస్సార్‌సిపి ప్రభుత్వంలో 80 బ్లాక్‌ల్లో 41.5 శాతం పనులు చేశాం. 2560 మంది లబ్ధిదారులకు టిడ్కో గృహాలు అందజేశాం. ఎన్నికల ప్రచారంలో చెప్పినట్టుగా ఆ మిగిలిన 10 శాతం టిడ్కో పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు శ్రావణమాసం ముగిసేలోపు అందించాలి.

– గుడాల గోపి, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, పాలకొల్లు నియోజకవర్గం

వివాహిత అనుమానాస్పద మృతి


కలిదిండి మండలం సానారుద్రవరం గ్రామంలో మృతిపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కైకలూరు: భార్యభర్తల మధ్య విభేదాల కారణంగా వివాహిత తాగునీటి చెరువులో శవమై తేలిన ఘటన కలిదిండి మండలం సానారుద్రవరం కొత్త కాలనీలో శుక్రవారం జరిగింది. పోలీసులు, మృతురాలి తల్లి తెలిపిన వివరాలు ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం గుమ్మలూరుకు చెందిన ఏడుకొండలు, శివ అదిలక్ష్మిల కుమార్తె అనంతలక్ష్మి(33)కి కలిదిండి మండలం సానారుద్రవరానికి చెందిన పుప్పాల నాగరాజు(37)తో 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పాప(12), బాబు(10) ఉన్నారు. నాగరాజు వ్యసనాలకు బానిసై భార్యను వేధిస్తున్నాడు. వేధింపులు భరించలేక రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. రెండేళ్లుగా పుట్టింట్లో ఉంటుంది. మూడు నెలల క్రితం నాగరాజు ఇబ్బంది పెట్టనని నచ్చచెప్పి సానారుద్రవరానికి భార్యను తీసుకొచ్చాడు. గురువారం రాత్రి 9 గంటలకు మృతురాలు ఫోన్ చేసి భర్త మద్యం తాగి గొడవ చేస్తున్నాడని తల్లికి చెప్పింది. ఉదయం 4 గంటలకు కూతురు చనిపోయిందని భర్త తరుపున బంధువులు ఫోన్ చేసి చెప్పారు. అనంతలక్ష్మి ముఖంపై దెబ్బలు తగిలిన గుర్తులు ఉన్నాయి. భర్త కొట్టి తాగునీటి చెరువులో ఊపిరాడనియ్యకుండా చేసి హత్య చేశాడని బంధువులు ఆరోపిస్తున్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై టి.రామకృష్ణ కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్


అదుపులోకి తీసుకున్న నిందితుడితో పోలీసు అధికారులు

కొయ్యలగూడెం: రామానుజపురంలో మహిళ హత్యకు సంబంధించి ఆమె భర్త సూర్యచంద్రంను అరెస్టు చేసినట్లు చేసినట్లు ఎస్ఐ జీజే విష్ణువర్ధన్ శుక్రవారం తెలిపారు. ఈనెల ఏడో తేదీ రామానుజపురంలో రాజానాల సాయిలక్ష్మీని భర్త సూర్యచంద్రం హత్య చేశాడని.. భార్యతో వేధింపులు, గొడవలు పడలేక హత్యకు పాల్పడినట్లు సూర్యచంద్రం పేర్కొన్నాడన్నారు. హత్య చేసిన అనంతరం పరారీలో ఉండగా ఉదయం రామానుజపురం నుంచి జంగారెడ్డిగూడెం వైపు వెళ్తుండగా నరసన్నపాలెం వద్ద అరెస్టు చేశామని తెలిపారు. హతురాలి తల్లి మోటేపల్లి నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

దోషులను తక్షణం అరెస్టు చేయాలి

ఎస్సీ కమిషన్ సభ్యుడు ఆనందప్రకాష్


చెల్లెం ఆనందప్రకాష్

పాలకొల్లు అర్బన్: విజయవాడ స్మృతివనంలో బీఆర్ అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేయడానికి కుట్రపన్నిన దోషులను తక్షణం అరెస్ట్ చేసి చట్టపరంగా శిక్షించాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ డిమాండ్ చేశారు. పాలకొల్లు సమీపంలోని యాళ్లవానిగరువులో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన విజయవాడ పోలీస్ కమిషనర్‌ను తక్షణం విధుల నుంచి తప్పించాలని కోరారు. అంబేద్కర్ విగ్రహంపై దాడి రాజ్యాంగంపై జరిగిన దాడిగా దేశం యావత్తూ అభిప్రాయపడుతుందన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషం


చింతలపూడిలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కంభం విజయరాజు


తాడేపల్లిగూడెంలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

చింతలపూడి: విజయవాడలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు తెలిపారు. చింతలపూడి పాత బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి విజయరాజుతోపాటు ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్, మండల అధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్, పట్టణ కన్వీనర్ కొప్పుల నాగు, పలువురు దళిత నాయకులు క్షీరాభిషేకం చేసి పూలదండలతో నివాళులర్పించారు. అనంతరం పాత బస్టాండ్ సెంటర్‌లో దోషులను శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకంపై వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరును ధ్వంసం చేయడం తీవ్రమైన నేరంగా భావించాలన్నారు. ప్రభుత్వం తక్షణం దుండగులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వర్రావు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్.భరత్‌రెడ్డి , రేచర్ల సర్పంచ్ శివరామకృష్ణ, గణిజర్ల సర్పంచ్ ఎ.వెంకట్రావు, చుండూరి నాగేశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు, ఎన్.దుర్గారావు, గోలి చంద్రశేఖర్‌రెడ్డి, పెనుగొండ శివ, మోహన్‌రావు, ఎస్సీ సెల్ నాయకులు ఎస్ కాంతారావు, కె.వెంకటేశ్వర్రావు, దారా పేర్రాజు, గోపి, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

తాడేపల్లిగూడెం అర్బన్: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషమని వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. తాలూకా ఆఫీసు సెంటరు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని పక్కనపెట్టి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేయడంతోపాటు రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్‌ను అవమానించడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బోణం విజయనిర్మల, బొద్దాని శ్రీనివాస్, రాపాక వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు


కొమ్ము, డోలు వాద్యాలతో నృత్యాలు చేస్తున్న గిరిజనులు

బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద శుక్రవారం ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విద్యార్థుల నృత్యరూపకం గిరిజనుల సంప్రదాయాల్ని కళ్లకు కట్టింది. అలాగే గిరిజన మహిళలు నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. వివిధ రకాల స్టాల్స్‌తో ఐటీడీఏ పరేడ్ గ్రౌండ్స్‌లో సందడి నెలకొంది. –బుట్టాయగూడెం


కల్లు తాగే నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు


గిరిజన సంప్రదాయ నృత్యం


బుట్టాయగూడెం మండలం ఐటీడీఏ వద్ద గిరిజన సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థులు


ఆకట్టుకున్న చిన్నారులు

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు


బోల్తా పడిన ఆటో వద్ద క్షతగాత్రులు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని తోకతిప్ప వద్ద శుక్రవారం ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికుల వివరాల ప్రకారం మొగల్తూరు మండలం కాళీపట్నంకు చెందిన బాలం మేరీ రాజ్యలక్ష్మి, ఆమె బంధువులు పాలకోడేరు మండలంలో శుభకార్యం ఉండటంతో ఆటో మాట్లాడుకుని కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. గూట్లపాడురేవు-తోకతిప్ప వద్దకు వచ్చేసరికి డ్రైవర్ ప్రక్కనే ఉన్న వ్యక్తి నిద్రలోకి జారుకుని ఆటోలోంచి బయటకు పడిపోతుండగా డ్రైవర్ హ్యాండిల్‌ను వదిలేసి ఆ వ్యక్తిని పట్టుకోవడంతో ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా భీమవరం ఆస్పత్రికి తరలించారు. ముగ్గురికి తీవ్రగాయాలవగా మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటనపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఎస్సై జి.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యతో గిరిపుత్రులకు ఉజ్వల భవిష్యత్తు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

బుట్టాయగూడెం: విద్య ద్వారానే గిరిపుత్రుల భవిష్యత్తు మారుతుందని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. మండలంలోని కోటరామచంద్రాపురం ఐటీడీఏ పరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి ఉన్నత విద్య లక్ష్యంగా ఐఏఎస్ సాధించానని తెలిపారు. విద్య ప్రాముఖ్యతను గుర్తించి తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత విద్య అభ్యసించేలా ప్రోత్సహించాలన్నారు. గిరిజనుల సమస్యల కోసం మండలాల్లోనే ప్రతి నెల 1న ప్రత్యేకంగా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. గిరిజనులు భూ సమస్యలు, రైతులు, వివిధ సమస్యలు తెలుసుకునేందుకు వివిధ శాఖలకు చెందిన అధికారులందరూ మీ వద్దకే వస్తారని వాటి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఐటీడీఏ పీఓ జి.శ్రీనుకుమార్, ఆర్డీఓ కె.అద్దయ్య, డీపీఓ తూతిక విశ్వనాథ్, జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొండలరాయుడు ఆలయంలో ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో కొండలరాయుడు

అత్తిలి: శ్రావణమాసం కంద పంచమి సందర్భంగా అత్తిలి గంటావారిపుంతలో కొలువై ఉన్న కొండలరాయుడు ఆలయంలో విశేష పూజలు జరిపారు. గురువారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చల్లపల్లి సుబ్బయ్యశాస్త్రి ఆధ్వర్యంలో పూజాదికాలను చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. కొండలరాయుడు గురువు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు పూజా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గూడెంలో 4.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెంలో గడచిన 24 గంటల్లో 4.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. కాగా, పెంటపాడు మండలంలో 40.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

తణుకు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నెల నుంచి ఇప్పటివరకు అనేక మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేసియున్నారని, ఆ ఖాళీల్లో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. తణుకు ఏపీటీఎఫ్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 117 జీవోను రద్దుచేసి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం పచేయాలని, పదో తరగతి వరకు తెలుగు, ఇంగ్లీషు మీడియంలను పునరుద్ధరించి డ్రాప్ అవుట్ రేటు తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కె.రామప్రసాద్, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీపీ పెద్దిరాజు, ఎన్.జయరాజు పాల్గొన్నారు.

ఐశ్వర్యదుర్గా మాతకు విశేష పూజలు



అమ్మవారి ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా అత్తిలి రామన్నపేటలో గల ఐశ్వర్య దుర్గా అమ్మవారి ఆలయంలో విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఫ్రైడే డ్రైడేపై అవగాహన కార్యక్రమం

తాడేపల్లిగూడెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను దూరం చేయవచ్చని మునిసిపల్ కమిషనర్ డి.మురళీకృష్ణ కోరారు. ఫ్రైడే డ్రైడేను పురస్కరించుకొని పట్టణంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులు, డెంగీ వ్యాధితో పాటు ఇతర వ్యాధుల నివారణపై ఆరోగ్యసిబ్బంది అధికారులు అవగాహన కల్పించారు. కమిషనర్‌తో పాటు వార్డు ఇన్‌చార్జిలు, అసిస్టెంటు కమిషనర్ గోపాలరావు విద్యార్థులు పాల్గొన్నారు.

11న నెలవారీ సంగీత, సాంస్కృతిక సమాహారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీవీఆర్ కళాకేంద్రం కళాకారులచే ఈ నెల 11వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు స్థానిక డీఎస్ చెరువు బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం నిర్వహించనున్నట్లు బీవీఆర్ కళాకేంద్రం నిర్వాహకులు బుద్దాల వెంకట రామారావు వెల్లడించారు. కళాకారులచే ట్రాక్ సింగింగ్, నృత్య ప్రియ డాన్స్ అకాడమీ వారిచే నృత్య ప్రదర్శనలు, అనంతరం మేనా నానాజీకి గౌరవ సేవా పురస్కారం, ఖండవల్లి నరుకుల సాయి శ్రీప్రియకు నాట్యరవళి పురస్కారం, దాతలు సహాయ సహకారంతో వేలూరుపాడు గిరిజన వరద బాధితుల సహాయార్థం ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కళాకారులు, సాహితి సభ్యులు, ప్రజలు సభను విజయవంతం చేయాలని కోరారు.

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సేవలు భేష్

- వృద్ధులు, పేదలకు కొండంత అండ
- మంచానికే పరిమితమైన వారి ఇంటికే వైద్యం
- అసోసియేషన్ సేవలను కొనియాడుతున్న ప్రజానీకం



తణుకులో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు వీల్‌చైర్స్ అందజేస్తున్న దృశ్యం



తణుకులో మంచానికే పరిమితమైన వృద్ధుల ఇంటికి వెళ్లి వైద్యసేవలందిస్తున్న డాక్టర్ హుస్సేన్ అహ్మద్



జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సేఫ్‌కేర్ సెంటర్‌లో ప్రొటీన్ డబ్బాలు అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: తణుకు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సేవలు అజరామజరంగా నిలుస్తున్నాయి. వయస్సులో ఉన్నంతవరకు వ్యాపార, ఉద్యోగ రంగాల్లో బిజీగా ఉన్న వారు రిటైర్మెంట్ అనంతరం గత 20 ఏళ్లగా తణుకులో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి వివిధ సేవా కార్యక్రమాలకు వేదికగా మారారు. ఆపదలో ఉన్న వృద్ధులు, పేదలకు ఆసరాగా నిలబడి వారికి అండగా నిలుస్తున్నారు. ఈ అసోసియేషన్‌లో ప్రముఖ వైద్యులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగ పదవీ విరమణ చేసిన వారు ఎందరో కొలువుతీరి సమాజానికి అవసరమైన నాణ్యమైన సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

అసోసియేషన్ అందజేస్తున్న సేవలివే..

తణుకు బ్యాంక్ కాలనీలోని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ భవనం వేదికగా సమాజంలోని వృద్ధులకు ఆర్థికంగా సాయం అందించడంతో పాటు తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని హెచ్ఐవీ రోగులు వైద్యసేవలు పొందే సేఫ్‌కేర్ సెంటర్‌లో రోగులకు ప్రొటీన్ డబ్బాలు నిత్యం అందించే కార్యక్రమం, ఆస్పత్రిలోని లెప్రసీ విభాగంలో డ్రెస్సింగ్ మెటీరియల్ సరఫరా, వివిధ రంగాల్లో సేవలు చేసేవారికి సత్కారాలు, అసోసియేషన్ భవనంలో నాణ్యమైన అధునాతన పరికరాలతో ఫిజియోథెరపీ సెంటర్ ఏర్పాటు చేసి రూ. 100లకే సేవలు, ప్రతి నెలా 3వ గురువారం అసోసియేషన్ భవనంలో రాజేష్ డయాబెటిస్ అండ్ ఎండోక్రైన్ సెంటర్ వైద్యులు డాక్టర్ మోగంటి రాజేష్ సహకారంతో వృద్ధులు, పేదలందరికీ వైద్యసేవలు, బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం, నడవలేని వారికి ఇంటికి వాహనం పంపించి నామమాత్ర రుసుముతో ఫిజియోథెరపీ వైద్యసేవలు అందించడం, దివ్యాంగులకు వీల్‌చైర్స్ అందచేయడం, పేద విద్యార్థులకు చదువు నిమిత్తం ఆర్థిక సాయం, ముఖ్యంగా అసోసియేషన్, స్థానిక నిసా హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మంచానికే పరిమితమైన వృద్ధులకు ప్రతి ఆదివారం ప్రత్యేక వాహనం ద్వారా ఇంటికే వెళ్లి నిసా హాస్పిటల్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, వైద్యబృందంచే వైద్యసేవలతో అసోసియేషన్ ఆదర్శంగా నిలుస్తోంది.

గత 20 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు



సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ద్వారా అందిస్తున్న సామాజిక సేవ అర్హులకు నేరుగా చేరుతున్నాయి. గత 20 ఏళ్లుగా అసోసియేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. పెద్దలు, దాతల సహకారం తీసుకుని వృద్ధులు, పేదలను గుర్తించి అండగా నిలుస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్న హెచ్ఐవీ రోగులకు నిత్యం ప్రొటీన్ డబ్బాలు అందిస్తున్నాం.

– అల్లూరి కరుణాకర చౌదరి,
సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, తణుకు

వృద్ధుల ఇంటికే వైద్యసేవలు అందిస్తున్నాం



సమాజంలో ప్రతి ఒక్కరూ సమానత్వంతో జీవించాల్సిన అవసరం ఉంది. అసోసియేషన్ ద్వారా చేసే సేవా కార్యక్రమాలు వృద్ధులు, పేదలకు అండగా ఉంటున్నాయి. ఎంత సంపాదించామనే దానికంటే ఎంతమందికి సేవ చేశామనేదే గొప్ప విషయం. అదే స్ఫూర్తితో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మంచానికే పరిమితమైన వృద్ధులకు ఇంటికే వెళ్లి వైద్యం అందించే అవకాశం నాకు దేవుడే కల్పించాడు.

– డాక్టర్ హుస్సేన్ అహ్మద్,
కంటి వైద్య నిపుణులు, తణుకు

11న ఉచిత నేత్ర వైద్యశిబిరం

అత్తిలి: ఈనెల 11వ తేదీన లయన్స్ క్లబ్ ఆఫ్ అత్తిలి ఆధ్వర్యంలో మంచిలి గ్రామంలో మార్టేరు రోడ్డులో ఉన్న భగవాన్ పూతరేకులు భవనంలో ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ జిల్లా చైర్మన్ యాతం రాంబాబు గురువారం ప్రకటనలో తెలిపారు. శిరగాని నాగేశ్వరరావు ఆర్థిక సహకారంతో, పాలకొల్లు ఆర్‌ఆర్ లయన్స్‌కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో నిర్వహించే కంటి వైద్యశిబిరంలో నేత్రాలను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా క్యాటరాక్ట్ ఆపరేషన్లు, కళ్ల జోళ్లను అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



నాగపంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు

తణుకు అర్బన్: నాగపంచమి సందర్భంగా తణుకు జాతీయ రహదారి సమీపంలోని గౌతమి సాల్వెంట్ ప్రాంతంలో ఉన్న శ్రీచక్రసహిత నాగదుర్గాదేవి (నాగమ్మ తల్లి) ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే నాగమ్మ తల్లికి అభిషేకాలు జరిపి, ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పుట్ట వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తణుకు పట్టణ నలుమూలల నుంచి అధికసంఖ్యలో హాజరైన భక్తులు అమ్మవారికి, పూలు, నిమ్మకాయలు సమర్పించి పూజాధికాలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

క్విట్ కార్పొరేట్ నినాదంతో నిరసన ర్యాలీ



పోలీస్ ఐలాండ్ వద్ద నిరసన చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తుందని, పోరాటాలతోనే బుద్ధి చెప్పాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. సేవ్ ఇండియా, సేవ్ అగ్రికల్చర్ అంటూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు సంయుక్త కిసాన్ మోర్చా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావులు మాట్లాడుతూ క్విట్ కార్పొరేట్ నినాదం దేశ వ్యాప్తంగా నిర్వహించి సంచలనం సృష్టించాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు దేశాన్ని తాకట్టు పెడుతోందని, దీని వల్ల కార్మిక, కర్షక, శ్రామిక ప్రజలు ఉపాధి, గిట్టుబాటు ధర, కనీస వేతనాలు లేక, పెరుగుతున్న ధరలు భరించ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్పొరేట్లకు అనుకూలమైన పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో జవ్వాది శ్రీను, యాండ్రపు కృష్ణ, నరమాల శ్రీను, చల్లా చంద్రరావు, చిటికిన రాము, పోతు శ్రీను, యడవల్లి వెంకట దుర్గారావు, పతివాడ నాగేంద్రబాబు, గొర్రెల సతీష్ కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకంపై దాడికి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తణుకు అర్బన్: విజయవాడ స్వరాజ్ మైదానంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహంపై జరిగిన దాడి అత్యంత శోచనీయమని న్యాయవాదులు ఖండించారు. శుక్రవారం తణుకు బార్ అసోసియేషన్ భవనం వద్ద న్యాయవాదులు తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి ఈద రామకృష్ణ మాట్లాడుతూ ఒక చారిత్రక ఘట్టానికి ఆద్యుడై ప్రపంచంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం నిర్మిస్తే ఆ విగ్రహ శిలాఫలకాన్ని దుండగులు దాడి చేసి ధ్వంసం చేయడం దారుణమన్నారు. దుండగులు ఎవరైనా సరే పట్టుకుని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాది పొట్ల సురేష్ మాట్లాడుతూ దళిత సంఘాలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాల నాయకులు ప్రజలు ఈ ఘటనను తీవ్రంగా ఖండించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌరు వెంకటేశ్వరరావు, గొల్లపల్లి అంబేడ్కర్, టి.నెహ్రూ ప్రభాకర్, చింతపల్లి వెంకటేశ్వరరావు, భాగ్యం, పి.డేవిడ్, ఎస్‌కే బాబ్జి, జంగం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలు, బాలసదన్‌లను సందర్శించిన న్యాయమూర్తి



తణుకు సబ్‌జైలులో ముద్దాయిలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

తణుకు అర్బన్: సబ్ జైలులో ఉన్న రిమాండ్ ముద్దాయిలు అవసరమైనప్పుడు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయసేవా సంస్థ ఆదేశాల మేరకు న్యాయమూర్తి శుక్రవారం సబ్‌జైలు, బాలసదన్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ బాలసదన్‌లో ఉండే విద్యార్థులకు అవసరమైన వసతులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా సబ్‌జైలులో ముద్దాయిలు, బాలసదన్‌లో విద్యార్థులకు అందజేస్తున్న ఆహార పదార్థాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలు క్లినిక్ న్యాయవాది చింతపల్లి నాగేశ్వరరావు, ప్యానెల్ న్యాయవాదులు ఎ.అజయకుమార్, కొల్లి ఆనంద్ కుమార్, జగిలంక శివ, తిర్రే సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ఎల్ఎల్ఎంలో నేడు ఉచిత మెగా క్యాంప్

పెంటపాడు: గూడెం బాగ్యలక్ష్మిపేట ఎల్ఎల్ఎం విమోచన చర్చిలో ఈనెల 10న ఉదయం 10 గంటల నుంచి ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు సంఘ వ్యవస్థాపకుడు మల్లిపూడి జైబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో అంకిత ఆస్పత్రి (రాజమండ్రి)కి చెందిన జనరల్‌మెడిసన్ డాక్టర్ మాధురి, డాక్టర్ సుధీర్‌కుమార్, జై ప్రాథమిక కంటి ఆస్పత్రి (రాజమండ్రి)కి చెందిన డాక్టర్ కుమార్, గూడెం వైష్ణవి ఆస్పత్రికి చెందిన డాక్టర్ వి. వెంకట్రావులు పాల్గొని వైద్యసేవలు అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9247201977 ఎల్ఎల్ఎం హెల్పింగ్ టీం సభ్యులను సంప్రదించాలన్నారు.

జ్యోతికశ్రీని స్ఫూర్తిగా తీసుకోవాలి



జ్యోతికశ్రీ ప్రదర్శనను స్క్రీన్‌పై చూస్తున్న మాంటిస్సోరి డైరెక్టర్ ప్రకాశరావు, విద్యార్థులు

తణుకు అర్బన్: ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబంలో పుట్టి భారతదేశం తరపున ఒలింపిక్స్‌లో పరుగుపెట్టే అవకాశం దక్కించుకున్న అథ్లెటిక్ దండి జ్యోతికశ్రీ పట్టుదల, పోరాటపటిమను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని మాంటిస్సోరీ స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు అన్నారు. తణుకు మాంటిస్సోరీ స్కూల్‌లో శుక్రవారం ఒలింపిక్స్‌లో జ్యోతికశ్రీ ప్రదర్శనను విద్యార్థులకు స్క్రీన్‌పై చూపించారు. ఈ సందర్భంగా ప్రకాశరావు మాట్లాడుతూ జ్యోతికశ్రీ మా స్కూల్‌లో విద్యాభ్యాసం చేయడం గర్వంగా ఉందని, చిన్నతనం నుంచి క్రీడలతోపాటు చదువులోను 90 శాతం మార్కులతో ముందువరసలోనే ఉండే జ్యోతికశ్రీ తండ్రి మాటను జవదాటకుండా పట్టుదలతో శిక్షణ తీసుకుని అంతర్జాతీయ స్థాయికి చేరిందంటే ఎంత కృషి చేసిందో గమనించాలని అన్నారు. ఒలింపిక్స్‌లో పతకానికి క్వాలిఫై అవకపోయినా ఆ స్థాయికి వెళ్లడం అంటేనే ఎంతో గొప్ప విషయంగా పరిగణించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జ్యోతికశ్రీ తల్లి తండ్రులు దండి లక్ష్మీనాగ వెంకటేశ్వరి, శ్రీనివాసరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశుగణనపై శిక్షణ



పశుగణనపై సిబ్బంది అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెంటపాడు: పమండలంలో ప్రతి ఇంటికి వెళ్లి పాడి పశువులు, పెంపుడు జంతువుల వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి పి. మురళీకృష్ణ అన్నారు. పెంటపాడులోని జిల్లా పశుసంవర్థక శాఖ డీడీ కార్యాలయంలో శుక్రవారం పశుగణనపై సిబ్బందికి రెండు రోజుల అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఈ కార్యక్రమం ప్రతిష్ఠాత్మకంగా జరుగుతోందన్నారు. పశుసంతతి మరింత అభివృద్ధి సాధించేందుకు సరైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. వచ్చేనెల 1 నుంచి పశుగణన చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. గూడెం డివిజన్‌లో 124 మంది ఎన్యూమరేటర్లుకు గాను 24 మందిని గుర్తించామన్నారు. వీరంతా నెల రోజుల శిక్షణ తర్వాత పశుగణన చేపడతారన్నారు. ఈ సందర్భంగా శ్యాంపిల్‌ను సేకరించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి క్రాంతి, డీడీ డాక్టర్ సుధాకర్, పెంటపాడు పశువైద్యాధికారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనంలోకి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకును ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: పట్టణంలోని సంతమార్కెట్‌లో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కార్యాలయాన్ని తణుకు రోడ్డులో ఉన్న నూతన భవనంలో శుక్రవారం మార్చారు. ప్రారంభ కార్యక్రమంలో శశి విద్యాసంస్థల అధినేత బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, ప్రముఖ వ్యాపారవేత్తలు నంద్యాల కృష్ణమూర్తి, కుందుల సత్యనారాయణ, ఉద్యానవర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, బ్రాంచ్ మేనేజర్ బి.వెంకటరాజు, హెచ్‌డీఎఫ్‌సీ అధికారి శ్రీరామమూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాల అమలు నిలిపివేయాలి



తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదులు

భీమవరం: కొత్త క్రిమినల్ చట్టాలు అమలు నిలిపివేయాలని కోరుతూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భీమవరం బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం తహసీల్దార్ ఆర్.రాంబాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు కాస్ట్రో మాట్లాడుతూ బెంగాల్ ప్రభుత్వం మూడు క్రిమినల్ చట్టాలను అమలుచేసేదిలేదంటూ అసెంబ్లీలో తీర్మానం చేసిన విధంగా మన రాష్ట్రంలో కూడా తీర్మాణం చేయాలన్నారు. యూనియన్ భీమవరం కన్వీనర్ దానం విద్యాసాగర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జూలై ఒకటో తేదిన కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకొచ్చిందని, దీని వల్ల వాక్ స్వాతంత్ర్యం, సమావేశమయ్యే హక్కు, నిరసన ప్రదర్శన చేసుకునే హక్కును కోల్పోతారన్నారు. బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎ.ప్రసన్నకుమార్, జ్యోతి, అంబేడ్కర్, రావూరి రాజేష్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో ప్రగతి కనిపించాలి

భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లాలోని ఇళ్ల నిర్మాణాల్లో మెరుగైన ప్రగతి కనిపించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

కార్మిక హక్కులను కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీవీవీఎస్ వర్మ

తణుకు టౌన్: పేదలు, రైతులు, కార్మికులకు ఆర్థిక న్యాయం కల్పించే సంక్షేమ సమాజాన్ని సాధించడానికి కార్పొరేట్ సంపద తిరిగి పంపిణీ జరగాలని రైతు కార్యాచరణ సమితి గౌరవ అధ్యక్షుడు డీవీవీఎస్ వర్మ చెప్పారు. శుక్రవారం క్విట్ కార్పొరేట్ డే సందర్భంగా స్థానిక సురాజ్య భవన్ కార్మిక, ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టాలను సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వంలో రైతాంగం తిప్పికొట్టినా స్వామినాథన్ సిఫార్సుల మేరకు అన్ని పంటలకు లాభసాటి ధరలను చట్టబద్ధంగా అమలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేకంగా నాలుగు చట్టాలను తెచ్చిందని, కార్మికుల పని గంటల పెంపుతో సహా వారి హక్కులను హరిస్తుందన్నారు. మరో వైపు దేశంలోని సహజ వనరులను కార్పొరేట్లకు కట్టబెడుతుందన్నారు. మోదీ ప్రభుత్వం సంక్షేమ పాలనను విస్మరించి కార్పొరేట్లను కొమ్ముకాస్తుందన్నారు. కార్పొరేట్లను కట్టడి చేసే పోరాటాలతో కార్మికుల హక్కులను కాపాడుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సీఐటీయూసి జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపకులు పేరూరి మురళీ కుమార్, రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి సభ్యురాలు సంకు మనోరమ, లంక కృష్ణ మూర్తి, ఎస్ఎస్‌పీఎస్ గౌరవ అధ్యక్షుడు గొల్లపల్లి అంబేడ్కర్, రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ నీలం మాల్యాద్రి, తదితరులు మాట్లాడారు. ఈసభలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు చల్లా అప్పారావు, అజ్జరు సుబ్బారావు, యర్రమిల్లి నరశింహారావు, సంకు అప్పారావు, వంక సత్యనారాయణ, భూపతిరాజు సుబ్బరాజు కుటుంబ సభ్యులను సత్కరించారు.

సీనియర్ సిటిజన్స్ సమస్యలు పరిష్కరించండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీనియర్ సిటిజన్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు సీనియర్ సిటిజన్స్ శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఏపీ సీనియర్ సిటిజన్స్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంపరాల నారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు ఆయన నివాసం వద్ద చిరుసత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో కె.బాలకృష్ణ, అడ్డాల సత్యనారాయణ, చిట్టి వెంకయ్య, వీకే వీరారావు, హరికుమార్, గ్రంధి సత్యనారాయణ, సత్యనారాయణమూర్తి, రామారావు, సుబ్బారావు, మురళీకృష్ణ, నారాయణరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

స్టేట్ టోల్ ప్రతిపాదనలు విరమించుకోవాలి

భీమవరం: రాష్ట్ర రహదారులపై టోల్‌టాక్స్ ప్రతిపాదనను ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలి సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే వాహనాల రిజిస్ట్రేషన్స్ సమయంలో లైఫ్ టాక్స్, రోడ్ ట్యాక్స్, గ్రీన్ ట్యాక్స్, డీజిల్, పెట్రోల్‌పై తదితర రూపాలలో ప్రభుత్వం పన్నులు వసూలు చేస్తోందని, మరలా స్టేట్ టోల్ టాక్స్ విధిస్తే ప్రజలపై విపరీతమైన భారం మోపినట్లవుతుందన్నారు. టోల్‌టాక్స్ కారణంగా లారీలు, ట్రాక్టర్లు వంటి వాహనాల కిరాయి పెరిగి రవాణా రంగంపై మరింత భారం పడి నిత్యావసర వస్తువుల ధరలు మరింత పెరుగుతాయని బలరామ్ ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ తప్పిదాల నుంచి ప్రస్తుత ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోవాలని హితవు పలికారు. టోల్‌టాక్స్ విరమించుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు.